

షాబాద్‌లో జెండాను ఎగరవేస్తున్న సీఐటీయూ నాయకులు

## ఘనంగా మేడే

కార్మిక దినోత్సవం అయిన మేడేను కార్మికులు బుధవారం జిల్లాలోని వాడవాడలా జరుపుకున్నారు. వివిధ కార్మిక సంఘాలు వివిధ కూడళ్లు, పరిశ్రమల వద్ద జెండాలను ఆవిష్కరించారు. భారీ ర్యాలీలు నిర్వహించారు. తమ హక్కుల కార్మిక సంఘాలు చేపట్టిన పోరాటాలు.. సాధించిన విజయాల గురించి కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు.


కోహెడ చౌరస్తా వద్ద కార్మిక జెండా ఎగరవేస్తున్న ఏఐటీయూసీ నాయకులు


తలకొండపల్లిలో జెండాను ఎగర వేస్తున్న సీఐటీయూ నాయకులు



లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ఎండదెబ్బ అడ్డంకిగా మారింది. ఒకవైపు ప్రచార గడువు ముంచుకొస్తుంటే, మరోవైపు రోజు రోజుకూ పెరుగుతున్న ఎండ తీవ్రత అభ్యర్థులకు, పార్టీల నేతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఎండ తీవ్రత ఉండడంతో ప్రచారం ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. దీంతో దిక్కుతోచక పార్టీల ముఖ్య నేతలు తలపట్టుకుంటున్నారు.

### ముంచుకొస్తున్న ప్రచార గడువు

ఇదిలా ఉంటే, ఎన్నికల ప్రచార గడువు ముంచుకొస్తోంది. ఈనెల 13వ తేదీన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరగనుండగా, 11వతేదీ, సాయంత్రం 5 గంటలకు ప్రచారం గడువు ముగియనుంది. ఎన్నికల ప్రచారానికి ఇంకా పది రోజులు మాత్రమే గడువు ఉంది. ఒకవైపు ప్రచారానికి తక్కువ సమయం ఉండడం, మరోవైపు ఎండలు మండిపోవడంతో ఏమి చేయాలో తోచక ప్రధాన పార్టీల ముఖ్య నేతలు తలపట్టుకుంటున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ మంది ఓటర్లను ఏ విధంగా కలువగలుతామనే విషయమ్మై దృష్టి సారించారు. ఎండతీవ్రత ఉండే మధ్యాహ్నం మినహాయించి ఉదయం, సాయంత్రం వేళల్లో నాయకులు, కార్యకర్తలను బృందాలుగా ఏర్పాటు చేసి ఇంటింటి ప్రచారం చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.



# ఎన్నికల ప్రచారానికి ఎండదెబ్బ!

- ఉదయం.. సాయంత్రం వేళల్లోనే ప్రచారం..
- ఎండ తీవ్రతకు ఉక్కిరిబిక్కిరవుతున్న కార్యకర్తలు
- ప్రచారానికి ఇంకా పది రోజులే గడువు

## మధ్యాహ్నం వేళల్లో విరామం

ఆంధ్రజ్యోతి, వికారాబాద్, మే1: ఎండలు నిప్పుల కొలిమిని తలపిస్తుండడంతో ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు నాయకులు ముందుకు రావడం లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండలు మండిపోతుండడంతో లోక్‌సభ ఎన్నికల ప్రచారం అంతంత మాత్రంగానే కొనసాగుతోంది. మధ్యాహ్నం సమయంలో ఇటీవల ఎండలను లెక్కచేయకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించిన కొందరు నాయకులు అస్వస్థతకు గురై ఆసుపత్రుల పాలయ్యారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు కూడా అదే సమయంలో నిర్వహిస్తున్నారు.మధ్యాహ్నం ఇంటింటి ప్రచార కార్యక్రమాలకు విరామం ఇస్తున్నారు. ఆ సమయంలో హాల్ మీటింగులు నిర్వహిస్తున్నారు. తమకు మద్దతుగా నిలుస్తున్న వారితో సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎండల తీవ్రతను గుర్తించిన ప్రధాన పార్టీల ముఖ్య నేతలు క్షేత్రస్థాయిలో కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా వారు నడుచుకుంటున్నారు. ఎండలను లెక్కచేయకుండా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తే ఏదైనా జరగరాని సంఘటన చోటు చేసుకుంటే తమకు ఎవరు అండగా ఉంటారంటూ అక్కడక్కడ కొందరు కార్యకర్తలు తమ నాయకులను నిలదీయడంతో పార్టీలు కూడా వారి అభిప్రాయాలకు అనుగుణంగా నడుచుకుంటున్నాయి.




### అప్పటి జోష్ ఏదీ ?

గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తల్లో ఆ జోరు, ఉత్సాహం, సందడి కనిపించడం లేదు. పార్టీల అభ్యర్థులు, ముఖ్య నేతలు వచ్చినప్పుడు మాత్రమే నాయకులు, కార్యకర్తలు కనిపిస్తున్నారు. నాయకుల ముందు కనిపించే ఎన్నికల ప్రచార సందడి వారు వెళ్లిన తరువాత కనిపించకుండా పోతోంది. ఈ తీరు ప్రధాన పార్టీల్లో కనిపిస్తోంది. ఇంతకు ముందు ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందే గ్రామాలు, పట్టణాల్లో రాజకీయ సందడి కనిపించేది. ఎక్కడ నలుగురు కలిసినా రాజకీయ పార్టీలు, అభ్యర్థుల గురించే చర్చ జరిగేది. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. తమను పలకరించకపోయినా, తమను తక్కువ చేసి చూస్తున్నట్లు అనిపించినా అలిగి ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. ఇలాంటి వారిని సమన్వం చేసుకుంటూ ఎన్నికల ప్రచారం నిర్వహించడమనేది పార్టీలకు సవాల్‌గా మారుతోంది.

### ఆసక్తి చూపని ఓటర్లు

ముఖ్య నేతలు బతిమిలాడితేనే నాయకులు, కార్యకర్తలు ప్రచారానికి వస్తున్నారంటే అతిశయోక్తి కాదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికీ వెళ్లి తమకే ఓటు వేయాలని ఓటర్లను స్వయంగా అభ్యర్థించారు. అభ్యర్థులు తమ గ్రామాల్లో ప్రచారం నిర్వహించిన తరువాత కూడా స్థానిక నాయకులు, కార్యకర్తలు ఓటర్ల ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహించే ప్రచారంతో ఎక్కువ మందిని కలవలేకపోతున్నారు. ఉదయం ఆరు గంటల నుంచే పట్టణాలు, గ్రామాల్లోకి ప్రచార రథాలు వస్తున్నా జనం అంతగా ఆసక్తి కనబరచడం లేదు. ఇంతకు ముందు తమ గ్రామాలు, తండాలకు ఎన్నికల ప్రచార వాహనాలు వస్తే ప్రజలు ఎంతో ఆసక్తిగా గమనించేవారు. మైక్‌ల్లో వినిపించే రికార్డు చేసిన ప్రసంగాలను వినేవారు. ఏ పార్టీ ఏమి చెబుతున్నదనేది గుర్తించేవారు. పార్టీలు చెప్పే అంశాలు, హామీలపైన చర్చ చేసేవారు. ఈ ఎన్నికల్లో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఓటర్లను ఆకట్టుకునేందుకు పాటలు పడుతూ, ప్రదర్శనలు ఇస్తున్నా ప్రజలు అంతగా ఆసక్తి చూపడం లేదు.

# అధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలి

- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ


మైసమ్మ ఆలయంలో పూజలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ

కడ్తాల్, మే 1 : కేంద్రంలో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ సంపూర్ణ మెజార్టీ సాధించి కేంద్రంలో రాహుల్‌గాంధీ నేతృత్వంలో అధికారంలోకి వస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. కడ్తాల మండలంలో బుధవారం దీపాదాస్ పర్యటించారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్ స్వాగతం పలికారు. కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నేతలతో ఆమె సమావేశమయ్యారు. బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని దీపాదాస్ మున్షీ సందర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని, రాహుల్ ప్రధాన మంత్రి కావాలని మైసమ్మ దేవతను కోరుకున్నట్లు ఆమె తెలిపారు. ఆలయ చరిత్రను స్థానికులు, కాంగ్రెస్ నాయకులు దీపాదాస్ మున్షీకి వివరించారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వపరంగా తగిన సాయమందేలా చూస్తానని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి విష్ణు, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్ పాల్గొన్నారు.

# కేసీఆర్ జైలుకెళ్లడం ఖాయం

- కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి మురుగన్


మాట్లాడుతున్న కేంద్రమంత్రి మురుగన్

ఆమనగల్లు, మే 1 : తెలంగాణలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి, పాపాలకు ఏదో ఒకరోజు మాజీ సీఎం కేసీఆర్ జైలుకు వెళ్లక తప్పదని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి మురుగన్ అన్నారు. బుధవారం ఆమనగల్లు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మురుగన్ మాట్లాడారు. బీఆర్ఎస్ హిందూ వ్యతిరేక, కుటుంబ పార్టీ అని.. అందువల్లే ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారని, లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆ పార్టీకి చావుదెబ్బ తప్పదని పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలకు కేరాఫ్ 'ఇండియా' కూటమి అని.. అందుకే అవినీతి పరులంతా ఒక్క తాటిపైకి వచ్చి కూటమిగా జతకట్టారని ఆరోపించారు. అవినీతిపరులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. ఇండియా కూటమిలో ఉన్న ఎవరికీ ప్రధాని అయ్యే అర్హత, అవకాశాలు లేవని, ఇండియా కూటమిని నమ్మి ప్రజలు అధికారమిస్తే.. ఏడాదికో ప్రధాని మారక తప్పదని పేర్కొన్నారు. మోదీ నాయకత్వమే భారత్‌కు శ్రీరామరక్ష అని, బీజేపీతోనే దేశ భద్రత సాధ్యమని అన్నారు. భారత రాజ్యాంగాన్ని బీజేపీ, ప్రధాని మోదీ భగవద్గీతతో సమానంగా భావిస్తున్నారని.. రాజ్యాంగాన్ని మార్చే శక్తి దేశంలో ఎవరికీ లేదని మంత్రి స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణకు బీజేపీ కట్టుబడి ఉందని.. అందుకే మాదిగలంతా తెలుగు రాష్ట్రాలలో బీజేపీకే మద్దతుగా నిలుస్తున్నారని అన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా, స్థానిక నాయకులు జక్క రఘునందన్ రెడ్డి, అశోక్ రెడ్డి, యెన్నం శేఖర్ రెడ్డి, బండెల రామచంద్రారెడ్డి తదితరలు పాల్గొన్నారు.

# అగ్నిగుండం..!

- కీసరలో 44.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

రంగారెడ్డి అర్బన్, మే 1 : భానుడు భగ్గుమంటున్నాడు. ఉమ్మడి జిల్లాపై నిప్పులు కురిపిస్తున్నాడు. వాతావరణం నిప్పుల కుంపటిలా మారింది. విపరీతమైన ఉక్కపోత, చెమటతో ఇబ్బందులు పడుతున్నారు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతూనే ఉన్నాయి. రానున్న మూడు రోజుల్లో మరింతగా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తుంది. అగ్నిగుండంగా మారుతున్న భానుడితో వడగాలులు ఎక్కువయ్యాయి. బుధవారం మేడ్చల్-మల్కాగిజిరి జిల్లా కీసర ఈఎస్ఎస్ ప్రాంతంలో అత్యధికంగా 44.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే వికారాబాద్ జిల్లా బంట్వారంలో 44.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిల్కూరు మృగవని ప్రాంతంలో 43.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

# ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం

- జిల్లా ఎన్నికల అధికారి శశాంక

రంగారెడ్డి అర్బన్, మే 1 : పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ శశాంక తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన పార్లమెంటు ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఈ సమీక్షలో జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడారు. చేవెళ్ల పార్లమెంట్ బరిలో 43మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను అందజేయడంతో పాటు ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా అభ్యర్థులందరికీ గుర్తులు కేటాయించినట్లు చెప్పారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ కోసం మూడు బ్యాలెట్ యూనిట్లు వినియోగించాల్సి ఉందని, ఈ మేరకు బుధవారం ఈసీఐఎల్ నుండి బ్యాలెట్ యూనిట్లు ఈవీఎం గోడౌన్‌కు చేరుకోనున్నాయని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈసీఐఎల్ ఇంజినీర్ల బృందంచే వాటి ఎఫ్ఎల్‌సీ జరిపిస్తున్నామని, ర్యాండమైజేషన్ అనంతరం కట్టుదిట్టమైన భద్రత నడుమ నియోజకవర్గ కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వివరించారు. ఓటరు సమాచార స్లిప్పులతో పాటు ఓటరు గైడ్, సి-విజిల్ కరపత్రాన్ని సిబ్బందిచే ఇంటింటికీ తిరిగి పంపిణీ చేయిస్తున్నామని తెలిపారు. కొత్త ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరుపుతున్నామని, నిర్ణీత గడువులోపు పంపిణీ పూర్తి చేస్తామని శశాంక వెల్లడించారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పిస్తూ, అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, 85 సంవత్సరాలు దాటిన సీనియర్ సిటిజన్ ఓటర్లు, దివ్యాంగ ఓటర్లు ఇంటి వద్ద నుండే ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలకు డమ్మీ బ్యాలెట్ పేపర్ ద్వారా ప్రయోగాత్మకంగా శిక్షణ ఇప్పించామని, పూర్తి పారదర్శకంగా, గోప్యతను పాటిస్తూ ఓటు సేకరించేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే పీఓలు, ఏపీఓలు, ఓపీఓలకు కూడా రెండో విడత శిక్షణ కొనసాగుతుందని, అన్ని పోలింగ్ కేంద్రాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కౌంటింగ్ కేంద్రంతో పాటు డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు పోలీసు బలగాలను మోహరించేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ శశాంక సీఈఓ దృష్టికి తెచ్చారు. సువిధ పోర్టల్ ద్వారా వచ్చే దరఖాస్తులను సకాలంలో పరిశీలిస్తూ వెంటనే అనుమతులు జారీ చేస్తున్నామని ఆయన చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్వో సంగీత, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

## ఎంబీఏ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మంచి ప్లేస్‌మెంట్లు


ప్రశంసలందుకుంటున్న విద్యార్థులు

మేడ్చల్ టౌన్, మే 1 : ఎంబీఏ పూర్తిచేసుకున్న విద్యార్థులకు మంచి ప్లేస్‌మెంట్లు అందేలా తమ యూనివర్సిటీ పనిచేస్తుందని మల్లారెడ్డి యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ వీఎస్‌కే.రెడ్డి అన్నారు. బుధవారం సన్‌స్టోన్ సంస్థ సహకారంతో ఎంబీఏ సూపర్ అచీవర్స్ కార్యక్రమం పేరిట క్లాస్ ఆఫ్-2024 ప్లేస్ మెంట్లకు ఎంపికైన విద్యార్థులకు సన్మానం నిర్వహించారు. వీ సీ వీఎస్‌కే.రెడ్డి మాట్లాడుతూ సన్‌స్టోన్ సంస్థ సహకారంతో తమ యూనివర్సిటీలో చదివే విద్యార్థులకు మంచి ప్లేస్‌మెంట్ వచ్చేలా తీర్చి దిద్దుతున్నామన్నారు. ఎంబీఏ చదివిన ప్రతి విద్యార్థి మంచి ఉద్యో గాలు పొందేలా పలు వ్యాపార, వాణిజ్య సంస్థలతో ఒప్పందం కుదుర్చు కున్నామని తెలిపారు.



## బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు

వికారాబాద్, మే 1 : బాల్య వివాహాలు జరిపినా, ప్రోత్సహించినా అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సంక్షేమ శాఖ అధికారి జ్యోతి పద్మ అన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్‌లైన్ సంయుక్తంగా బాల్య వివాహాల నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారి జ్యోతిపద్మ మాట్లాడుతూ.. ఈ నెలలో వచ్చే అక్షయ తృతీయ సందర్భంగా ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లుగా సమాచారం ఉంటే ముందస్తుగా టీచర్లు, ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో ఉండే ప్రజలు, పూజారులు, ఖాజీలు,పాస్టర్లు, పెళ్లి జరిగే ఫంక్షన్ హాల్ యజమానులు జిల్లాలోని డీసీపీయూ అధికారులకు లేదా చైల్డ్‌లైన్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఒకవేళ బాల్య వివాహానికి కుటుంబ సభ్యులు, గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు ఎవరైనా సహకరించినా అలాంటి చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే ఐసిడిఎస్, మిషన్ వాత్సల్య సిబ్బంది బాల్య వివాహాల నిర్మూలనకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామాలు, తండాల్లో బాల్య వివాహాలు అరికట్టేందుకు బాల్యవివాహ నిరోధక అధికారులకు, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్ శాఖ అధికారుల, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆమె కోరారు. సమావేశానికి జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు శ్రీకాంత్, ఆంజనేయులు, చైల్డ్‌లైన్ ప్రతినిధి రాజునాయక్, హబ్బు కోఆర్డినేటర్ బలరాంనాయక్, సఖి ప్రతినిధి యశోద, సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వెల్ఫేర్ అధికారి జ్యోతి పద్మ

## కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు కలిగించొద్దు

బొంరాస్‌పేట్, మే 1: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దని వ్యవసాయ శాఖ వికారాబాద్ జిల్లా అధికారి గోపాల్, ఏడీఏ శంకర్‌రాథోడ్ అన్నారు. బుధవారం బొంరాస్‌పేట్ మండలంలోని మెట్లకుంటలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు పరిశీలించారు. తేమ శాతాన్ని పరిశీలించి తేమ ఉన్న వరి ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు ధాన్యాన్ని తూర్పార చేసిన తర్వాతే కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో భార్గవి, రైతులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్ర నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఏవో

## నంబిగురు మఠాన్ని పరిశీలించిన తహసీల్దార్

నవాబుపేట, మే 1: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో గల నంబి గురుస్వామి ఆలయ ఆవరణలో జరుగుతున్న పనులపై ఇరువర్గాలు ఫిర్యాదుతో బుధవారం తహసీల్దార్ జానకీరామ్ ఆ పరిసరాలను పరిశీలించారు. ఆలయ భూ వివరాలను తెలుసుకున్నారు. అక్కడ చేపడుతున్న పనులపై ఫిర్యాదు రావడంతో పరిశీలన చేశామన్నారు. తిమ్మారెడ్డిపల్లి, చిట్టిగిద్ద వాసులు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్



పంట పొలాల్లో ఆనవాళ్లను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

## అన్నారం శివారులో పులి సంచారంపై వదంతులు

- ఆనవాళ్లు పరిశీలించిన ఫారెస్టు అధికారులు

కొడంగల్, మే 1: అటవీ ప్రాంత సమీప పొలాల్లో పులి సంచరిస్తోందనే వదంతులు ఆందోళన కలిగిస్తున్నాయి. అన్నారం శివారులోని మాడమీదిపల్లి ఆంజనేయస్వామి అటవీ ప్రాంతంలో వారం రోజులుగా పులి తిరుగుతోందని ప్రచారం కలకలం రేపుతోంది. బుధవారం మేకను కరుచుకొని పోయిందని గ్రామస్తులు భయాందోళనతో మాజీ సర్పంచ్ అనితాపకీరప్పకు తెలిపారు. ఆమె జిల్లా ఫారెస్టు అధికారి జ్ఞానేశ్వర్‌కు సమాచారమిచ్చారు. కొడంగల్ ఫారెస్టు అధికారులు ఫరూక్‌అలీ, రాజు, రాములు సిబ్బంది అన్నారం పొలాల్లో ఆనవాళ్లను పులి కాలి గుర్తులను పరిశీలించారు. ఇక్కడ దట్టమైన పొదలు ఉండటంతో పులి సంచరించే ఆస్కారం ఉందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటీవలే దౌల్తాబాద్ మండలం చల్లాపూర్‌లో పులి సంచారాన్ని గుర్తించినట్లు చెప్పారు. వేసవిలో వన్యప్రాణులు తాగునీరు, ఆహారం కోసం పొలాల వద్దకు రావడం సహజం అని తెలిపారు.

# ఆరు గ్యారెంటీల అమలు అసాధ్యం

తాండూరురూరల్, మే 1 : తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని. ప్రజలు కేసీఆర్‌ను నమ్మడం లేదని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేయడం సాధ్యం కాదన్నారు. బుధవారం తాండూరు మండలం గోనూరు ఎంపీటీసీ నర్సమ్మ, మాజీ సర్పంచ్ గోవింద్‌లు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి విశ్వేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన బీజేపీలో చేరారు. అదే విధంగా గోనూరు, వీరశెట్టిపల్లికి చెందిన ఎర్ర శ్రీనివాస్, రాజు, భీంరెడ్డి, రాంరెడ్డి, నర్సింహా, పరుశురాం, ఎర్ర శ్రీశైలం, చీమల హరి, శంకర్, మల్లప్ప, మల్లేశం, బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్‌కుమార్, గౌతాపూర్ ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి, నాయకులు బొప్పి శ్రీహరి తదితరులు ఉన్నారు.

### కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిక

మండల పరిధిలోని చంద్రవంచ గ్రామంలో కాంగ్రెస్‌కు చెందిన విజయ్‌కుమార్‌రెడ్డితోపాటు కొంతమంది యువకులు బీజేపీలో చేరారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరగా ఆయన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కాగా, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తన గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలను సరిగ్గా పట్టించుకోవడం లేదని విజయ్‌కుమార్ ఆరోపించారు.

### మేడే వేడుకల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు : తాండూరు మార్కెట్‌లో నిర్వహించిన ప్రపంచ కార్మిక దిన వేడుకల్లో చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. మాట్లాడుతూ మేడే వేడుకలను కార్మికుల సమక్షంలో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. మార్కెట్‌లోని వర్తక సంఘం, హమాలీ సంఘం సభ్యులతో ముచ్చటించారు. కార్మికుల సంక్షేమం కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించారు. త్వరలో ప్రపంచ ఆర్థిక రంగంలో భారత ఆర్థిక వ్యవస్థ మూడో స్థానాన్ని ఆక్రమిస్తుందని కొండా ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం తాండూరులో జరిగిన వీరశైవ సమాజ్ ఆత్మీయ సమ్మేళనంలో విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. బసవేశ్వరుడు సమాజంలోని అంతరాలను ప్రశ్నించిన మహనీయుడని కొనియాడారు. ఆయన చూపిన మార్గం.. నడవడిక నేటి నాయకులకు మార్గదర్శకమని తెలిపారు. ఆయన ఆదర్శంగా తీసుకొని సమాజంలో మార్పుకోసం ప్రతి ఒక్కరు సేవా మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. వీరశైవ సమాజ్ అధ్యక్షుడు బస్వరాజ్ ఆధ్వర్యంలో 200 మంది సభ్యులు బీజేపీలో చేరారు.



తాండూరు : సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి

### చేవెళ్ల ఎంపీగా కొండాను గెలిపించాలి

మహేశ్వరం/మొయినాబాద్ రూరల్/చేవెళ్ల/షాబాద్ : తుక్కుగూడ ప్రజలు చేవెళ్ల ఎంపీగా విశ్వేశ్వరొరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని తుక్కుగూడ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్ కోరారు. మున్సిపల్ పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాగా, మోదీ పాలనలో మచ్చుకైనా అవినీతి లేదని భూతద్దం, మైక్రోస్కోప్ పెట్టి చూసినా ఎవరూ ఏమీ చేయలేకపోయారని కాంగ్రెస్ నాయకులపై బీజేపీ రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకులు గున్నాల గోపాల్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం హిమాయత్ నగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ వాళ్లు, కుల రిజర్వేషన్ రద్దు నినాదం ఎత్తుకున్నారని, బీఆర్‌ఎస్ పార్టీ హైదరాబాద్ కేంద్రపాలిత ప్రాంత నినాదం ఎత్తుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ చేవెళ్ల మండలాధ్యక్షుడు పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డిలు మండలంలోని అల్లావాడ, జలాగూడలో విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం చేశారు. దేశ ప్రగతి మోదీతోనే సాధ్యమౌతుందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్ రెడ్డి అన్నారు. షాబాద్ మండలం అప్పారెడ్డిగూడ, నరేడ్లగూడ, దామర్లపల్లి, నాందార్‌ఖాన్‌పేట్ గ్రామాల్లో బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వినర్ రాము, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి కూతురు మహేందర్, బీజేవైఎం మండలాధ్యక్షుడు మహేష్‌లతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు.

### విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపుతో అభివృద్ధి సాధ్యం

మోమిన్‌పేట్/ధారూరు/మర్పల్లి/వికారాబాద్/కులకచర్ల/బషీరాబాద్ : విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపుతో తెలంగాణ అభివృద్ధి సాధ్యపడుతుందని ఆ పార్టీ మోమిన్‌పేట మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు ఆశిరెడ్డి అన్నారు. గోవిందపూర్, చక్రంపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ధారూరులోని వివిధ కాలనీల్లో నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. బీజేపీకి ఓటు వేసేందుకు ప్రజలు పూర్తి విశ్వాసంతో మద్దతు తెలుపుతున్నారని జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. మర్పల్లి మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. దేశం కోసం, ధర్మం కోసం బీజేపీకి ఓటువేసి గెలిపించాలని బీజేపీ జిల్లా నాయకులు రాజేందర్ రెడ్డి, బుస్సా శ్రీకాంత్ అన్నారు. వికారాబాద్ పట్టణంలోని ఇందిరానగర్, అంబేడ్కర్ కాలనీల్లో ప్రచారం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి పాల్గొన్నారు. విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా బీజేపీ నాయకులు కులకచర్లలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. బషీరాబాద్ మండలం జీవన్గి, బద్లాపూర్, బద్లాపూర్‌తండాలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల నుంచి పలువురు యువకులు, నాయకులు, కార్యకర్తలు తాండూరులో విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో దాదాపు 50 మంది బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఉప్పరి రామేష్ కుమార్, జిల్లా కార్యదర్శి గంగాధర్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

## ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

వికారాబాద్, ఏప్రిల్ 11: ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తూ పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు వికారాబాద్ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్‌శర్మ అన్నారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించే ప్రచారం నిర్వహించుకోవాలన్నారు. ప్రజలు అందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఎం పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డీటీ అనిత పాల్గొన్నారు.

# బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటా

- మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్

మచ్చబొల్లారం, మే 1 : బడుగు, బలహీనవర్గాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని వీబీఆర్ గార్డెన్‌లో బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజిగిరిలో ఈసారి బీజేపీ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. మల్కాజిగిరి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. అనంతరం ఎస్సీ మోర్చా నాయకులు ఈటలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి క్రాంతికిరణ్, మేడ్చల్ జిల్లా ఎస్సీ మోర్చా నాయకుడు మురళి, కరుణాకర్, లవ్‌కుమార్, నాగరాజు, రమేశ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



మచ్చబొల్లారం : మచ్చబొల్లారంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

### నేను పక్కా లోకల్ : ఈటల

ఏఎస్‌రావునగర్ : నేను పక్కా లోకల్ అని, ఇక్కడే పుట్టిపెరిగానని ఈటల రాజేందర్ అన్నారు. ఏఎస్‌రావునగర్‌లో బుధవారం ఫోరం ఫర్ ఇంప్రూవింగ్ థింగ్స్(ఎఫ్ఐటి)ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన లోక్‌సత్తా పార్టీ నాయకుడు జయప్రకాష్ నారాయణతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ మోదీకి ముచ్చటగా మూడోసారి ఓటు వేయాలని దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుందని తెలిపారు. దేశంలో గతంలో ఎప్పుడూ సంకీర్ణ ప్రభుత్వాలే ఉండేవని, గత పదేళ్ల నుంచి స్థిరమైన ప్రభుత్వం ఉందని అన్నారు. ప్రధాని మోదీ వ్యక్తి కాదని ఒక శక్తి అని పేర్కొన్నారు. దేశంలో రైల్వే స్టేషన్లు, ఆసుపత్రులు అంతర్జాతీయ స్థాయిలో రూపుదిద్దుకుంటున్నాయని ఈటల తెలిపారు. లోక్‌సత్తా నాయకుడు జయప్రకాష్‌నారాయణ వంటి వారు ప్రధాని మోదీని బలపరచడం అభినందనీయమన్నారు. అచ్చమైన తెలంగాణ బిడ్డనైన నన్ను ఇతర పార్టీల వారు ఎక్కడి నుంచి వచ్చావని ప్రశ్నిస్తున్నారని నేను పక్కా లోకల్ అని తెలిపారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను ఎంపీగా గెలిపించాలని ఈటల కోరారు. సమావేశంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రాజేందర్‌ను మెజారిటీతో గెలిపించాలి

రామంతాపూర్/నిజాంపేట్/షాపూర్‌నగర్/మౌలాలి/మేడ్చల్ : ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరుతూ రామంతాపూర్ డివిజన్ పరిధిలోని 254, 255, 256 బూత్‌ల అధ్యక్షులు, కో-ఆర్డినేటర్లు రేవ నర్సింహ కురుమ, బుర్ర రాజేశ్వర్, బొడ్డుపల్లి ఆనంద్, గుండె భిక్షపతిల ఆధ్వర్యంలో పాత రామంతాపూర్‌లో కార్పొరేటర్ బండారు శ్రీవాణి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ దేశంలో నరేంద్ర మోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గురించి ఓటర్లకు వివరించి ఈటలను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అలాగే హబ్సిగూడ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఈటలకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. అలాగే నిజాంపేట్ కార్పొరేషన్‌లోని మధురానగర్, బాచుపల్లి కౌసల్య కాలనీల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాపు సంఘ నాయకులు బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్, బీజేపీ నాయకులు చక్రధర్‌ల ఆధ్వర్యంలో ఈటల సమక్షంలో పార్టీలో చేరారు. అలాగే ఈటల రాజేందర్ సూరారంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్‌లోని సంజయ్‌గాంధీనగర్, శ్రీకృష్ణనగర్, మార్కేండేయనగర్, నెహ్రూ నగర్‌లోను ప్రచారం చేశారు. గాజులరామారం డివిజన్‌లోని ఉషోదయ కాలనీ కమ్యూనిటీ హాల్లో బీజేపీ నాయకులతో కలిసి ఈటల సమావేశమయ్యారు. పలువురు బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. కాగా, కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటు వేసి వృథా చేయవద్దని ఈటల సూచించారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని మల్కాజిగిరి, వినాయకనగర్, మౌలాలి డివిజన్‌లలోని కేశవ్‌నగర్ నుంచి వినాయకనగర్ చౌరస్తా మీదుగా సంతోష్‌మాతనగర్ చౌరస్తా నుంచి ఓల్డ్ సఫీల్‌గూడ వరకు రోడ్‌షో నిర్వహించారు. కార్పొరేటర్‌లు తదితరులు పాల్గొన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల సమక్షంలో మేడ్చల్ మండలం సోమారానికి చెందిన పలువురు బీజేపీలో చేరారు. నారెడ్డి నందారెడ్డి, మాజీ జడ్పీటీసీ శైలజాహరినాథ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు పార్టీలో చేరారు.

# ఆరు గ్యారెంటీలు పక్కాగా అమలు

- చేవెళ్ల ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

శంకర్‌పల్లి, మే 1: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలను పక్కాగా అమలు చేస్తుందని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. బుధవారం శంకర్‌పల్లి మండలంలో నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో మాట్లాడుతూ విశ్వేశ్వర్‌రెడ్డి ఐదేళ్లకోసారి ఎన్నికల్లో విహారయాత్రకు వస్తూ పోతుంటారని, తర్వాత ప్రజలను పట్టించుకోరని అన్నారు. తాను ఎంపీగా ఐదేళ్లు చేవెళ్ల పరిధిలో సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారన్నారు. తనపై విశ్వేశ్వర్‌రెడ్డి యేసిన ఆరోపణలు సత్యదూరం అన్నారు. అంతకుముందు వివిధ పార్టీల నాయకులు పలువురు కాంగ్రెస్‌లో చేశారు. చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు సత్యనారాయణరెడ్డి, పీసీసీ కార్యదర్శి ఉదయ్‌మోహన్ రెడ్డి, మండలాధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి : మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

### చేవెళ్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

చేవెళ్ల/షాబాద్/మొయినాబాద్ రూరల్/మహేశ్వరం/కందుకూరు/రాజేంద్రనగర్/ఎల్‌బీనగర్/హైదర్‌నగర్: చేవెళ్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. చేవెళ్ల మండలం కందవాడకు చెందిన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శేరి పెంటారెడ్డి, రంజిత్‌రెడ్డిల ఆధ్వర్యంలో సీఎం క్యాంప్ కార్యాలయంలో రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. షాబాద్ మండల బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, రవీందర్‌రెడ్డి కూడా పార్టీలో చేరారు. మండల బీఆర్‌ఎస్ నాయకుడు, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు కోట్ల నరోత్తంరెడ్డి 50మందితో కలిసి రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. మహేశ్వరాన్ని కాంగ్రెస్‌కు అడ్డాగా మార్చి పార్టీని తిరుగులేని శక్తిగా తయారు చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి నేరెళ్ల శారద అన్నారు. తుమ్మలూరు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు వారి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పీసీసీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి కందుకూరు మండలం మీర్ఖాన్‌పేట, ఆకులమైలారంలో, బొక్క జంగారెడ్డి బేగంపేటలో ప్రచారం చేశారు. రంజిత్‌రెడ్డిసతీమణి సీతారెడ్డి కోరారు. మే డేను పురస్కరించుకుని కాటేదాన్ టీఎల్‌ఎం గార్డెన్‌లో ఏఐటీయూసీ నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అలాగే సీతా రంజిత్‌రెడ్డి సరూర్‌నగర్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. భగత్‌సింగ్‌నగర్‌లో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి గడపగడపకు వెళ్లి కాంగ్రెస్ హస్తం గుర్తుకు ఓటు వేసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు.

### తాండూరు అభివృద్ధి బాధ్యత నాది

తాండూరు రూరల్/బషీరాబాద్/ధారూరు/పెద్దేముల్/బంట్వారం/కులకచర్ల/మర్పల్లి/వికారాబాద్/నవాబుపేట/యాలాల : తాండూరు నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో తాను ఎమ్మెల్యేగా గెలిచానని, తాండూరు అభివృద్ధి బాధ్యత తనదని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు మండలం దస్తగిరిపేట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రంజిత్‌రెడ్డి గెలుపు కోసం చేతిగుర్తుపై ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యం అన్నారు. బషీరాబాద్‌లో యూత్ కాంగ్రెస్ ఎన్నికల సన్నాహక సమావేశంలోనూ ఎమ్మెల్యే పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి పేదల కోసం ఎన్నో సేవాకార్యక్రమాలు చేపడుతున్నారని గుర్తుచేశారు. మైల్వార్‌లో 200 మంది వివిధ పార్టీల కార్యకర్తలు ఎమ్మెల్యే సోదరుడు సత్యనారాయణ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సోంపల్లి బిచ్చిరెడ్డి, పి.సుధాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి సత్తార్ పాల్గొన్నారు. ధారూరు కాంగ్రెస్ నాయకులు ఉపాధి కూలీలను కలిసి చేతి గుర్తుకు ఓటేసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. బుజ్జయ్యగౌడ్, బాబాఖాన్, కిరణ్‌కుమార్, ముజాఫర్, అంజయ్య, రవీందర్, దావూద్, లక్ష్మయ్య పాల్గొన్నారు. ఈ నెల 6న వికారాబాద్‌లోని గౌలికార్ ఫంక్షన్ హాల్లో నిర్వహించే మైనార్టీల సమావేశానికి ముస్లింలు తరలిరావాలని కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయ్యూబ్ అన్సారీ తెలిపారు. మండల గ్రామాల్లో పర్యటించి ముస్లింలతో సమావేశమయ్యారు. పెద్దేముల్ మండల కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. జడ్పీటీసీ ధారాసింగ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, డీవై.నర్సిములు పెద్దేముల్ పెద్దచెరువు వద్ద కూలీలతో మాట్లాడి చేతిగుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రతొక్కరూ కాంగ్రెస్‌కే ఓటువేయాలని బంట్వారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోచారం వెంకటేశం అన్నారు. యాచారంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హరీశ్వర్‌రెడ్డి, యాదగిరి, వెంకటయ్య, తౌఫీక్‌పాషా, హర్షవర్ధన్‌రెడ్డి, అజీం, శ్రీనివాస్, ఇసాక్, వెంకటేశం, శంకర్ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అని కులకచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర అన్నారు. ముజాహిద్‌పూర్‌లో ఉపాధి కూలీలతో మాట్లాడారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ఖాయమని మర్పల్లి కాంగ్రెస్ నాయకులు అన్నారు. పట్టణంలో ప్రచారం నిర్వహించారు. వికారాబాద్ ప్రాంత అభివృద్ధికి వేల కోట్లు కేటాయిస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటీ ఇచ్చారని వికారాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. మద్గుల్ చిట్టంపల్లి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ముత్తహర్‌షరీప్, మల్లయ్య పాల్గొన్నారు. నవాబుపేట మండలం చించల్‌పేట్ మాజీ సర్పంచ్ కాలె శ్రీనివాస్, మరికొందరు రంజిత్‌రెడ్డి, భీం భరత్‌ల సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ ఎక్బాల్, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కొండల్‌యాదవ్, ఉపేందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీధర్, సంగారెడ్డి పాల్గొన్నారు. 13న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని యాలాల మండలం అన్నాసాగర్‌కు కాంగ్రెస్ నాయకుడు సత్యనారాయణరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.


ఆమనగల్లు : మేడే వేడుకల్లో విద్యుత్ 1104 కార్మిక యూనియన్ నాయకులు


కొందుర్గు : మాట్లాడుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య


కొత్తూర్ : పారిశ్రామికవాడ వద్ద వంశీ చంద్‌తో కలిసి కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి


షాద్‌నగర్ : జెండా ఎగురవేస్తున్న కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్

# ఘనంగా మేడే వేడుకలు


మాడ్గుల : విద్యుత్తు కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

**ప్రపంచ కార్మిక దినం సందర్భంగా జిల్లావ్యాప్తంగా వివిధ కార్మిక సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో బుధవారం కార్మికులు, నాయకులు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు, యూనియన్ నాయకులు జెండాలను ఎగురవేసి ర్యాలీలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కార్మిక శక్తి వర్ధిల్లాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల సాధనకు ప్రతీ ఒక్కరు పోరాడాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.**


యాచారం : నందివనపర్తిలో కార్మికులను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకుడు బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు


మహేశ్వరం : మంఖాల్ పారిశ్రామిక వాడలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకుడు దత్తునాయక్


కేశంపేట : సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకుడు సాయిబాబు


కొత్తూర్ : పారిశ్రామికవాడ వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు



ఇబ్రహీంపట్నం : సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి తదితరులు


చౌదరిగూడ : మేడే వేడుకల్లో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు జంగయ్య తదితరులు


కందుకూరు : విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదుట జెండాను ఎగురవేస్తున్న కార్మిక సంఘం నేతలు


శంషాబాద్ : జెండా ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పర్వతాలు


కడ్తాల : మేడే వేడుకల్లో కార్మికులను సన్మానిస్తున్న నాయకులు

## పేద విద్యార్థులకు చేయూత

● వైఆర్పీ ఫౌండేషన్ అధినేత ఎలిషాల రవిప్రసాద్

రంగారెడ్డి అర్బన్, మే 1 : వైఆర్‌పీ ఫౌండేషన్ ద్వారా నిరుపేద విద్యార్థులకు చేయూతనందిస్తున్నట్లు వైఆర్పీ ఫౌండేషన్ అధినేత ఎలిషాల రవిప్రసాద్ అన్నారు. ఇంటర్, పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. కేక్ కట్ చేసి వేడుక చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్‌లోని వైఆర్పీ ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఫౌండేషన్ ద్వారా 12 మంది పదో తరగతి విద్యార్థులకు ఆర్థికంగా ఆదుకోవడం జరిగిందని, వారందరూ ఫలితాల్లో 9.5 గ్రేడ్‌లో ఉత్తీర్ణత సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పదో తరగతి విద్యార్థులే కాకుండా ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ చదువుతున్న 28 మందికి ఫీజులు చెల్లించడం జరిగిందని, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు. బొడ్డు నవీన్ సాయి అనే విద్యార్థి ఇంటర్ మొదటి సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు పొందటం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎలిషాల రవిప్రసాద్

## చేవెళ్లలో బీఆర్ఎస్ జెండా ఎగరేస్తాం


చేవెళ్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల/కందుకూరు, మే 1 : చేవెళ్లలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. బుధవారం చేవెళ్ల మండలం కమ్మెట, గొల్లగూడలో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. చేవెళ్ల మాజీ ఎంపీపీ. బాల్‌రాజ్, మండలాధ్యక్షుడు ప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు నర్సింలు, బి.నర్సింలు, చంద్రశేఖర్, నాయకులున్నారు. కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌కు ప్రజలందరూ ఓట్లు వేయాలని ఏఎంసీ చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీనర్సింహ్మారెడ్డిలు కోరారు. గురువారం కందుకూరు మండల శాఖ అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మీర్కాన్‌పేట, బేగరికంచ, ఆకులమైలారంలో ఇంటింటికి, వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి ప్రచారం చేశారు. నాయకులు కార్యకర్తలున్నారు.

## కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

ఆమనగల్లు, మే 1: కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం, సుస్థిర పాలన సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలం రాంనుంతల, కడ్తాల మండలం చరికొండలో బుధవారం నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. మండలాధ్యక్షులు జగన్, బీక్యనాయక్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే, పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్‌లు హాజరయ్యారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించి మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గుర్రం కేశవులు, వస్పుల జంగయ్య, జగన్, దావ ధనుంజయ్య, తదితరులున్నారు.


రాంనుంతలలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

## దేశాన్ని ముక్కలు చేస్తున్న మోదీ

చౌదరిగూడ/కొందుర్గు/షాద్‌నగర్‌రూరల్/కేశంపేట, మే 1: కుల, మతాల పేరుతో దేశాన్ని నరేంద్ర మోదీ ముక్కలు చేస్తున్నారని, బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. ప్రజలంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించి దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని కాస్లాబాద్, ఎదిర, రావిర్యాల, గుర్రంపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులు, పూలతో స్వాగతం పలికారు. మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డి, మండలాధ్యక్షుడు రాజు, కొందుర్గు మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బంగారం ధరలు తగ్గాలంటే, కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని వంశీచంద్‌రెడ్డి అన్నారు. కొందుర్గు మండల కేంద్రంలోని దళితవాడలో, మండల పరిధిలోని ఆగిర్యాల, వెంకిర్యాల, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదేళ్లలో కేసీఆర్ ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, ఒక్క ఇల్లు కూడా కట్టించలేదని, ఒక్క ఫించన్ కూడా ఇవ్వలేదని, గ్రామానికో ఉద్యోగం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. మోదీ సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తానని, ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కొందుర్గులో కాలేజీని త్వరలోనే ఏర్పాటు చేయడం జరుగుతుందని, క్రీడా స్టేడియాన్ని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ సంక్షేమ పథకాలను ఆకర్షితులై పార్టీలో భారీగా చేరికలు అవుతున్నాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. చౌదరిగూడ మండలం వనంపల్లి మాజీ సర్పంచ్ కవిత గోపాల్‌రెడ్డితో పాటు మాజీ వార్డు సభ్యులు షాద్‌నగర్ శంకర్, వంశీచంద్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. గుర్రంపల్లి మాజీ సర్పంచ్ నిర్మల లక్ష్మీనారాయణతో పాటు 32 కుటుంబాలకు చెందిన సభ్యులు పార్టీలో చేరారు. వంశీచంద్‌కు మద్దతుగా ఫరూఖ్‌నగర్ మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. వెలిజర్లలో మాజీ ఎంపీటీసీ నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. షాద్‌నగర్ ఏఎంసీ మాజీ చైర్మన్ యాదయ్య యాదవ్ నేతృత్వంలో కేశంపేట మండలం బైర్కాన్‌పల్లి, మంగళగూడలో ప్రచారం చేపట్టారు. చౌలపల్లిలో మండలాధ్యక్షుడు వీరేశ్, కేశంపేటలో యెన్నం శ్రీధర్‌రెడ్డి, కొండారెడ్డిపల్లి పల్లె ఆనంద్ కుమార్, పోమాల్‌పల్లిలో అనుమగళ్ల రమేష్ తొమ్మిదిరేకులలో కరుణాకర్ రెడ్డి, లింగంధనలో రాజేందర్ రెడ్డి, కొత్తపేటలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్ఫ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.


చౌదరిగూడ : వంశీచంద్‌కు పూలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

## ఘనంగా వేంకటేశ్వరుడి కల్యాణం

● వేలాదిగా తరలివచ్చిన భక్తులు

షాద్‌నగర్ అర్బన్, మే 01: షాద్‌నగర్ శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణ నక్షత్రాన్ని పురష్కరించుకుని బుధవారం రాత్రి రంగరంగ వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం జరిగింది. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు నేతృత్వంలో పట్టణానికి చెందిన వ్యాపారి పరిగి వెంకట సాయిశ్వర్‌రెడ్డి సరిత దంపతులు తమ సొంత ఖర్చులతో కల్యాణాన్ని నిర్వహించారు.



## సంక్షిప్తంగా..

**శంషాబాద్ :** పదో తరగతిలో సత్తాచాటిన శ్రీశారదా విద్యామందిరం పాఠశాల విద్యార్థులను బుధవారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ప్రశంసించారు. శంషాబాద్ మధురానగర్ శ్రీశారదా విద్యామందిర్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని పాఠశాల కరస్పాండెంట్ డేందర్‌రెడ్డి తెలిపారు.

**ఇబ్రహీంపట్నం :** పీసీసీ లీగల్‌సెల్, మానవ హక్కులు, ఆర్టీఐ వైస్ చైర్మన్‌గా రంగారెడ్డి జిల్లా ఆదిభట్లకు చెందిన ఈసీ దేవాగౌడ్‌ను నియమిస్తూ టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ప్రకటించారు. ఈమేరకు నియామకపత్రం అందజేశారు.

**కొందుర్గు :** బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా మండల కేంద్రానికి చెందిన బోయ శంకర్‌ను నియమించారు. జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి నియామకపత్రాన్ని అందజేశారని శంకర్ తెలిపారు.

**కందుకూరు :** దాసర్లపల్లిలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణ పనులను గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఆ గ్రామానికి చెందిన కుర్నమోని జయేందర్‌ముదిరాజ్ సొంత నిధులతో నిర్మించనున్న దేవాలయాన్ని వేద పండితులు రాజుశర్మ నేతృత్వంలో ఉదయం గ్రామస్తులతో కలిసి హోమాన్ని నిర్వహించారు.

**మాడ్గుల :** తెలంగాణ సాధించి, ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపుకోసం కృషి చేయాలన్నారు.

**కొత్తూర్ :** సిద్దాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి తరఫున ఇంటింటి ప్రచారం చేశారు. బి.దేవేందర్ యాదవ్, వడ్డె బాలయ్య, యాదగిరి, కోస్గి శ్రీనివాస్, డోలీ రవీందర్, మెండె కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**కేశంపేట :** మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణగౌడ్ పిలుపునిచ్చారు. లింగంధనలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

**యాచారం :** యాచారం, చౌదర్‌పల్లి, గున్‌గల్, గడ్డమల్లాయగూడ, మాల్ తదితర గ్రామాల్లో బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తలు పోటాపోటీ ఎంపీ ఎన్నికల ప్రచారం చేశారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ ఎంపీపీ కొప్పు సుకన్యబాషా, మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి నడికూడి కృష్ణ, అబ్బయ్య తదితరులు ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను గెలిపించాలని కోరుతూ మల్లేష్ కుమార్తె ఆరోణ, అల్లుడు కృష్ణకాంత్, సొసైటీ చైర్మన్ టి.రాజేందర్‌రెడ్డిల అధ్వర్యంలో గున్‌గల్, గడ్డమల్లాయగూడ గ్రామాలలో ఓటర్ల మద్దతు కోరారు.

**కొందుర్గు :** తనను గెలిపించాలని ధర్మ సమాజ్ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి గంట్లవెల్లి రాకేష్ కోరారు. చిన్నఎల్కిచర్ల, తంగెళ్లపల్లి, విశ్వనాథ్‌పూర్, చుక్కమెట్, టేకులపల్లిలో ప్రచారం చేశారు.

**ఆమనగల్లు :** ఆమనగల్లు లయన్స్‌క్లబ్ 39వ నూతన అధ్యక్షుడిగా కల్వకుర్తికి చెందిన పసుల లక్ష్మారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా కడ్తాలకు చెందిన దోనాదుల మహేశ్, కోశాధికారిగా ఆమనగల్లుకు చెందిన గుజ్జరి నర్సింహ, పీఆర్‌వోగా ఎంఏ పాషా, ఉపాధ్యక్షులుగా గోవర్ధన్‌రెడ్డి, ఎం.రాంరెడ్డి, పి.వెంకట్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఎంగళి బాలకృష్ణ, టేమర్‌గా బండెల రామచంద్రారెడ్డి, టెల్‌ట్విస్టర్‌గా మోహన్‌రెడ్డి, ముఖ్య సలహాదారులుగా యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, సంపత్‌కుమార్, చంద్రశేఖర్, కర్నాకర్‌రెడ్డి, అంజయ్య, సునంద, బిక్షపతి, సత్యం, చంద్రకాంత్‌రెడ్డి, రవికుమార్, సురేందర్ రెడ్డిలు ఎన్నికయ్యారు.

**శంషాబాద్ :** ఫోన్ దొంగిలించిన వ్యక్తిని తామే పట్టుకొని పోలీసులకు అప్పగిస్తే విచారణ చేసి ఫోన్ ఇప్పించాల్సింది పోయి.. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కొట్టాడని, ఆయనపై తగిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని బుధవారం ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సీఐ బాల్‌రాజ్‌ను బాధితుడు ఆంజనేయులు ఆశ్రయించాడు. శంషాబాద్ మున్సిపాలిటీ చారీనగర్‌బస్తీలో ఆంజనేయులు అనే దివ్యాంగుడు తల్లి పెంటమ్మతో కలసి ఉంటున్నాడు. ఏప్రిల్ 28న స్నేహితుడు శివ తన ఫోన్‌ను తీసుకొని ఎంతకూ తిరిగి ఇవ్వలేదు. దాంతో ఆంజేయులు పోలీసులకు సమాచారం అందించాడు. అయితే ఫోన్ ఇప్పించాల్సింది పోయి హెడ్‌కాని స్టేబుల్ శ్రీనివాస్ తనను ఇష్టం వచ్చినట్టు కొట్టాడని, మా అమ్మపై కూడా చేయి చేసుకున్నాడని బాధితుడు వాపోయాడు. ఈ విషయమై సీఐ బాల్‌రాజ్ విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## క్రైం కార్నర్

### లైంగికదాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

చేవెళ్ల, మే 1 : బాలికపై అత్యాచారనికి పాల్పడి, మోసం చేసిన వ్యక్తికి 20 సంవత్సరాల జైలు శిక్షతోపాటు, రూ. 40 వేలు జరిమానా విధిస్తూ ఎల్‌బీ నగర్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి హరీష బుధవారం తీర్పునిచ్చారు. చేవెళ్ల ఏసీపీ బంటు కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. 2017లో చేవెళ్లలో నివాసం ఉంటున్న ఓ బాలికను సంగారెడ్డి జిల్లా కల్హార్ మండలం కిస్తాపూర్‌కు చెందిన రత్నం అలియాస్ కిరణ్(34) అనే యువకుడు ఫోన్ ద్వారా పరిచయం చేసుకున్నాడు. ప్రేమ పేరుతో బాలికను పెళ్లి చేకుంటానని మయామాటలు చెప్పి యాదగిరి గుట్ట తీసుకువచ్చాడు. అక్కడ గదిని అద్దెకు తీసుకుని అమ్మాయిని శారీరకంగా వాడుకున్నాడు. కొన్నిరోజుల తర్వాత బాలిక గర్భం దాల్చింది. తర్వాత వివాహం చేసుకోనని చెప్పి బాలికను మోసం చేశాడు. దాంతో ఆమె కుటుంబ సభ్యులు చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అప్పటి సీఐ గురువయ్యగౌడ్ హత్యచారం, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశాడు. వాదోపవాదలు విన్న న్యాయమూర్తి కేసు రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 40 వేల జరిమానా విధించారు.

### చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

కందుకూరు, మే 1: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సీఐ మక్బూల్‌జానీ తెలిపారు. ఏప్రిల్ 29న మండల పరిధిలోని కొత్తగూడ గ్రామంలో భిక్షాటన చేసుకుంటూ అనారోగ్యానికి గురైన వ్యక్తి (65)ని చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించినట్లు సీఐ తెలిపారు. ఆయన చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు చెప్పారు. ఆయనకు వడదెబ్బ తగిలినట్లు వైద్యులు తెలిపినట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### రైలు ఢీకొని గుర్తుతెలియని మరో వ్యక్తి..

షాద్‌నగర్‌రూరల్, మే 1: షాద్‌నగర్ రైల్వే స్టేషన్ పరిధిలోని లింగారెడ్డిగూడ శివారులో గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు. సుమారు 60 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి లింగారెడ్డిగూడ మసీదు వెనుక రైలు ఢీకొని మృతిచెందాడని తెలిపారు. వైట్‌కలర్ బనియన్, తెల్లటి గడ్డం, కుడిచేతికి రెండు వరసల నల్లటి ధారం కట్టి ఉన్నట్లు తెలిపారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు 9848090426కు సమాచారం ఇవ్వాలని కోరారు.

### నందిగామ మండల కేంద్రంలో మరొకరు..

నందిగామ, మే 1: రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన నందిగామ మండల కేంద్రంలోని రైల్వేట్రాక్‌పై బుధవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. మృతుడు ధరించిన ప్యాంటు జేబులో లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా అస్సాం రాష్ట్రానికి చెందిన ప్రణబ్ దాస్(46)గా గుర్తించారు. మండలకేంద్రం సమీపంలో రైలు ఢీకొని మృతి చెందినట్లు రైల్వేపోలీస్ మల్లేష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాదనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### టిప్పర్ బోల్తా.. డ్రైవర్ దుర్మరణం

కొత్తూర్, మే 1: కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిద్దాపూర్ గ్రామ శివారులో గల క్వారీ వద్ద బుధవారం టిప్పర్ బోల్తా పడిన సంఘటనలో డ్రైవర్ మూడావత్ హన్మంత్(46) మృతి చెందాడని ఎస్ఐ జి. శ్రీనివాస్ తెలిపారు. క్వారీ వద్ద గల కంకర్ మిషన్ వద్ద టిప్పర్ ద్వారా కంకరను తరలిస్తుండగా అదుప తప్పి బోల్తా పడడంతో హన్మంత్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుని భార్య మోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి. శ్రీనివాస్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడు..

షాద్‌నగర్‌రూరల్, మే 1: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పరిగి రోడ్డులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌లింగం కథనం ప్రకారం మొగిలిగిద్ద గ్రామానికి చెందిన సందీప్(26) అనే యువకుడు షాద్‌నగర్‌కు చెందిన స్నేహితుడు ఫోన్ చేయడంతో రాత్రి 9 గంటలకు బైక్‌పై షాద్‌నగర్ వస్తుండగా ఎలికట్టలో రోడ్డుపై నిలిపి ఉన్న లారీని ఢీకొట్టాడు. దాంతో అక్కడికక్కడే మృతి చెదాడు. తల్లి విజయలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

శంషాబాద్, మే 1 : శంషాబాద్ ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాతంరాయి-గగన్ పహాడ్ రోడ్డు పక్కన పడిఉన్న ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 40-45 సంవత్సరా వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి శరీరంపై అడ్డుగీతల టీ షర్టు, బ్లూ కలర్ ప్యాంటు ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సునీతా మహేందర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం


ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు


పేట్‌బషీరాబాద్, మే 1 : మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డికి మద్దతుగా కొంపల్లి మున్సిపల్‌లో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని ఇంటింటా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టబోయే పథకాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్‌కు ఓటు వెయ్యాలని కోరారు. మున్సిపల్‌లో ఎన్నికలు జరిగే రోజు ప్రతీఒక్కరూ తమ ఓటుహక్కును విని యోగించుకోవాలని, సునీతా మహేందర్‌రెడ్డికి ఓటు వేయాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ నాయకులు జిమ్మి దేవేందర్, షేక్ ఇబ్రహీమ్, వెంకట్‌రెడ్డి, అంజి ముదిరాజ్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## అరుణమ్మ గెలుపు ఖాయం : పీవీఆర్


కొత్తూర్ : ప్రచారంలో పాల్గొన్న పీవీఆర్

కొత్తూర్/షాద్‌నగర్ రూరల్/చౌదరిగూడ, మే 1: ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూస్తే మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపు ఖాయమనిపిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. కొత్తూర్ మండలం ఇన్ముల్‌నర్వ, సిద్దాపూర్, వైఎం తండా, ఎస్‌బీ పల్లి, కొడిచర్ల, పెంజర్ల గ్రామాల్లో విష్ణువర్ధన్‌రెడ్డి ప్రచారం చేశారు, బావండ్ల మాణిక్యం, మంగలి రమేష్, మహేందర్‌రెడ్డి తదితరులున్నారు. కాగా, కొత్తూర్ మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, కొత్తూర్ జీపీ మాజీ పర్సన్ ఇన్‌చార్జి కడెంపల్లి సదానంద్‌గౌడ్ బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో డీకే అరుణ సమక్షంలో పార్టీలో చేరారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్టలో డీకే అరుణకు మద్దతుగా సీనియర్ నాయకులు వెంకటేష్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. అరుణమ్మకు మద్దతుగా చౌదరిగూడ మండలం తుమ్మలపల్లి, గాలిగూడ, ఎదిర తదితర గ్రామాల్లో నాయకులు ప్రచారం చేశారు. మండలాధ్యక్షుడు కురుమయ్య, నాయకులు భూపాలచారి, దిలీప్‌రెడ్డి, లింగం, బీమయ్య, తదితరులున్నారు.

## సేంద్రియ పద్ధతిలో మిద్దె తోటల సాగు ఉత్తమం


అవగాహన కల్పిస్తున్న డా.ప్రభు

ఇబ్రహీంపట్నం, మే 1: ఆకుకూరలు, కూరగాయలను సేంద్రియ పద్ధతి ద్వారా సాగు చేయడం ఉత్తమమని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె. ప్రభు సలహా చేశారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో డిగ్రీ కళాశాల బీఎస్సీ క్రాప్ ప్రొడక్షన్ విద్యార్థులతో పాటు చుట్టు పక్కల ఉన్న గృహిణులకు టెర్రస్ గార్డెనింగ్ (మిద్దె తోటలు)పై అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో ఈ పద్దతిన పంటలు సాగే చేయవచ్చని పైగా ఆరోగ్యానికి కూడా ఇవి మంచిదన్నారు. ఎరువులు, జీవామృత్, బీజామృత్, సంజీవక్, పంచామృత్, వేపనూనెల తయారీ విధానంపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, అధ్యాపకులు టి.రామరాజు, డా.జి.నాగోజీ, శ్రీను రాథోడ్, ప్రాజెక్టు లీడర్ కె.రామకృష్ణ తదితరులున్నారు.